# నమ్మలేని నిజం

సరిగ్గా టైమ్ చూసాను రాత్రి పదకొండు గంటలైనది. స్కూటరు మీద ఒక్కడినే ప్రయాణం చేస్తున్నానేమో కొంచెం బెరుకు బెరుకుగానే ఉన్నది. జేబు లోంచి సిగరెట్టు తీసి అంటించా. కనీసం మా వూరు వెళ్ళాలంటే ఇంకా రెండు గంటలైనా పడుతుంది. మర్నాడు ఆదివారం. అమ్మా నాన్నని చూసి చాలాకాలము అవటం వలన మా ఊరికి ప్రయాణం కట్టాను.

మా వూళ్ళోకి వెళ్ళాలంటే హీనంగా ఓ మైలు దూరమన్నా పొలాలు మధ్య లోంచి మట్టిరోడ్డు మీదగా వెళ్ళాలి. ఒక వైపు భయం భయంగా ఉన్నా స్కూటరుని మట్టిరోడ్డుమీదకి ఎక్కించక తప్పలేదు. చెట్లన్నీ దెయ్యాలులాగా తలలూపు తున్నాయి పదిగజాల దూరం వెళ్ళేసరికి చెట్లమధ్య ఏదో తెల్లని ఆకారం కన్పించింది గుండె భయంతో బరువెక్కింది. ఎట్లాగో ధైర్యంచేసి "అవసరమైతే అప్పుడే చూద్దాము అనుకున్నా. ఇంతలో ఆ ఆకారం మట్టిరోడుకు అడ్డంగా వచ్చింది స్కూటరు హెడ్‌లైట్ల వెలుతురులో స్పష్టంగా ఆ ఆకారం ముఖం కన్పించింది. ఆ ఆకారము నా చిన్ననాటి స్నేహితుడు శీను. వాడు కూడ వెంటనే నన్ను గుర్తు పట్టాడు. వెంటనే స్కూటరు బ్రేక్ వేసి వాడిని స్కూటరుమీద ఎక్కించుకొని బయలు దేరాను రెండు నిమిషాలు ఇద్దరిమధ్య ఆనందంతో మాటలు లేవు చివరకు నేనే.

"ఒరేయి శీను! మొత్తానికి నన్ను హడల గొట్టేశావు గదుట్రా. చెట్లచాటున ఉన్న నిన్ను చూసి దెయ్యమేమో అనుకున్నారా!" అన్నాను.

నా మాటలకు వాడు నవ్వి, "ఏరా కృష్ణా! ఎన్నేళ్ళయిందిరా నిన్ను చూసి. ఏమిటి రోజు రోజుకు ఇంత చిక్కి పోతున్నావ్! పట్నవాసం జీవితం ఎట్లా ఉంది? నెలకు జీతం ఎంత వస్తుంది?" అని ప్రశ్నలు కురిపించాడు.

వాడడిగిన వాటన్నింటికీ ఓపికగా సమాధానం చెప్పి, "ఏరా! నా సంగతికేమిలే. నువ్వు చూడు ఎట్లా తయారయ్యావో! అమ్మ, నాన్న, భార్య పిల్లలు అంతా కులాసేనా? ఏమిటి మన ఊరు సంగతులు?" అని ప్రశ్నించా.

"ఆ! ఏం కులాసా లేరా! అమ్మా-నాన్న ఆరోగ్యం రోజు రోజుకు క్షీణించుతోంది. పెళ్ళయిన మూడేళ్ళలోనే ఇద్దరు పిల్లలు. పెద్దవాడు పేరు మురళి, రెండవ వాడు పేరు శేషు నా భార్య ఆరోగ్యం కూడ రోజు రోజుకు క్షీణించుతోంది." అన్నాడు బాధగా.

"బాధపడకురా. కష్టాలు కలకాలం ఉండవు." అన్నాను ఓదార్పుగా. రెండు నిమిషాలు ఇద్దరిమధ్య నిశ్శబ్దం అలుముకున్నది.

"ఏరా శీను." ఇంత రాత్రిపూట

ఏ. ఏ. ఎస్. కుమార్

ఇక్కడ ఏం చేస్తున్నావురా." అన్నాను ఇంకేం మాట్లాడాలో తెలియక

"పొలానికి నీళ్ళు పెడుతున్నారా. ఈ మధ్య ఇక్కడ దొంగలు ఎక్కువగా తిరుగుతున్నారు ఎవరూ లేని సమయములో పంట రాల్చుకు పోతున్నారు. అందుకని పొలానికి కాపలాగా ఉన్నాను." అన్నాడు రెండు నిమిషాలు ఆగిన తరువాత వాడే.

"ఏరా కృష్ణా, నా పెళ్ళి అని శుభలేఖ పంపినా రాలేదు. అప్పుడు లేరా నువ్వు ఎందుకు వస్తావులే, ఈ బీదవాడి పెళ్ళికి." అన్నాడు నిష్ఠూరంగా

"ఛా, అదేమి మాటలురా, ఏ పెళ్ళికి వద్దామని శత విధాల ప్రయత్నం చేసా. కాని అర్జంట్‌గా క్యాంప్ వెళ్ళవలసి వచ్చింది. అందుకని రాలేక పోయాను. అంతేగాని నీ పెళ్ళికి రాకూడదనే ఉద్దేశము నాకు లేదురా. జరిగిన దానికి నన్ను క్షమించలేవా" అన్నాను.

"ఐలే వాడివిరా నువ్వు నేను ఏదో సరదాగా అంటే నువ్వు అది సీరియస్‌గా తీసుకున్నావు మనలో మనకు క్షమాపణ ఏమిటి" అన్నాడు వాడు

ఇంతలో ఊరి పొలిమేర వచ్చింది. 'ప్రొద్దున్న కలుస్తానని చెప్పి శీను స్కూటరు దిగి వెళ్ళిపోయాడు. ఊరు ఇది వరకటి కన్నా అభివృద్ధి చెందినట్టే కనిపిస్తున్నది. ఎలక్ట్రిసిటీ సప్లయి, మున్సిపల్ పంపులు, పంపులు, డాబాలు, మంచి మట్టి రోడ్డులతో చిన్న సైజు పట్టణములా ఉన్నది.

ఇంటికి వెళ్ళగానే అమ్మ తలుపు తీసింది. ఆకస్మికంగా వచ్చినందుకు ఆశ్చర్యపడి, చాల కాలానికి వచ్చినందుకు సంతోషించింది. కాళ్ళు కడుక్కొని, స్కూటరు ఇంటి ముందు వుంచి పెట్టి, బెడ్డింగ్ లోపల పెట్టా. బాగా ప్రొద్దుపోవడం వలన, బడలికగా ఉండి వెంటనే నిద్రపోయాను

ఉదయం ఎనిమిది గంటలకి అక్కయ్య వచ్చి లేపేవరకు నాకు నిద్ర మెలకువ రాలేదు. మొఖం కడుక్కొని అమ్మ ఇచ్చిన కాఫీ త్రాగడం మొదలుపెట్టాను ఇంతలో నాన్న వచ్చి "ఏరా రాత్రి ప్రయాణం ఎట్లా సాగింది; పాపం చాల అలసిపోయినట్టున్నావు. రాత్రి మంచి నిద్రలో ఉండి నీ రాక గమనించలేకపోయా." అన్నాడు.

"ప్రయాణం బాగానే సాగిందినాన్న రాత్రి వస్తుంటే అదే మన రెడ్డిగారబ్బాయి శీను కలిశాడు పాపం కుటుంబ సమస్యల వలన గామోను బాగా చిక్కిపోయాడు...." అని చెబుతున్నాను."

"ఒరేయ్ కృష్ణా ; ఏకేమన్నా మతి భ్రమించిందా రెడ్డిగారింటి, శీను ఏంటి ; సంవత్సరక్రితం దొంగలు శీనును పొలంలో కొట్టిచంపేస్తే." అన్నాడు నాన్న.

నా వీపుమీద ఎవరో కొరడాతో చరిచి నట్లయినది "ఏమిటి నాన్న నీవు మాట్లాడుతున్నది నిజమేనా" అన్నాను

"నిజమేరా నాయనా, పాపం వాళ్ళ అమ్మా నాన్న కొడుకు చచ్చిపోయిన తరువాత ఇక్కడ ఉంటే ఆ సంగతులే గుర్తు వస్తాయని ఈ ఊరు విడిచి వెళ్ళిపోయారు. పాపం భార్య పిల్లలు కూడ చాలా చిన్న వాళ్ళే" అన్నది అమ్మ బాధగా.

ఆ రోజు అక్కడ గడిపి, సాయంత్రం అమ్మా నాన్న వద్ద సెలవుతీసుకొని బయలుదేరా. ఆ మట్టి రోడ్డు మీద ప్రయాణం చేస్తున్నంతసేపు నాకు గతరాత్రి జరిగిన సంఘటనలు ఒకటొకటి జ్ఞాపకం రావటం మొదలుపెట్టాయి. సైన్స్ అభివృద్ధి చెందిన ఈ రోజులలో, సైన్సు లెక్చరర్‌గా పని చేస్తున్న నాకు నిన్న జరిగినదంతా "నమ్మలేని నిజంగా" తయారయినది. ★